

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 28-07-2026 | సంపుటి - 31 | సంచిక - 64 | రూ : 4 | పేజీలు: 8


### 63 ధిక్కరణ కేసులు

## భూకబ్జాదారులు వేసినవే

**వాటిని చట్టబద్ధంగానే ఎదుర్కొంటా**

- రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తా
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి



హైదరాబాద్: తనపై ఉన్న 63 ధిక్కరణ కేసులు భూకబ్జాదారులు వేసినవేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. సామాన్యుల ప్లాట్లను, ప్రభుత్వ భూములను కొట్టేయాలని చూస్తున్న బడా భూకబ్జాదారులను అడ్డుకుంటున్నందుకే కేసులు వేశారని, రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తూ, ప్రభుత్వం తనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా వందశాతం ఫలితాలు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. తనను మార్చాలంటూ హైకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో రంగనాథ్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ఆయన పేర్కొన్న అంశాల ప్రకారం.. "రెండేళ్ల కాలంలో హైడ్రా కమిషనర్‌గా రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 48ఎ ప్రకారం పనిచేస్తున్నా. ఈక్రమంలో మార్కెట్ విలువ ప్రకారం రూ.1.5 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులు రక్షించాం. ఆరు చెరువులు పూర్తిస్థాయిలో పునరుద్ధరించగా.. మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. బడాబాబులు ఆక్రమించిన వందల చెరువులు, పార్కులు, వేల ఎకరాల సర్కారు భూములను హైడ్రా వెనక్కి తెచ్చి ప్రభుత్వానికి అప్పగించింది. భూమాఫియా, భూకబ్జాదారులు తప్పుడు సమాచారంతో న్యాయ స్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. లోతుకుంట భూమి విషయంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన భూమిని శాంతా శ్రీరాం అనే స్థిరాస్తి సంస్థ కొట్టేయాలని చూసింది. అనుమతులు తరువాయి 2లో

# 'సర్'పై అధిష్ఠానం సీరియస్!

**పేదల ఓట్లు తొలగించకుండా చూడాలి**

- పీసీసీకి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశం
- భవిష్యత్ కార్యాచరణపై మీనాక్షి నటరాజన్‌తో సమీక్షించాలని నిర్దేశం



దిల్లీ: రాష్ట్రంలో ఆగస్టు 3వరకు జరిగే సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్‌సర్) ప్రక్రియను సీరియస్‌గా తీసుకోవాలని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వాన్ని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ సానుభూతిపరులు, పేదలు, బడుగు, బలహీనవర్గాల ఓట్లు పోకుండా జాగ్రత్తపడాలని నిర్దేశించారు. దీనిపై ఇప్పటివరకు చేసిన కసరత్తులో వచ్చిన ఫలితాలు, క్షేత్రస్థాయి వాస్తవాలను బేరీజు వేసుకొని తక్షణ కార్యాచరణ చేపట్టేందుకు పార్టీ ప్రభుత్వం మధ్య ఏర్పాటైన సమన్వయ కమిటీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో బుధవారం సమావేశం కావాలని ఆదేశించారు. ఆయన సోమవారం సాయంత్రం ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, వంశీచంద్‌రెడ్డి తదితరులతో తెలంగాణ సంస్థాగత వ్యవహారాలపై సమీక్షించిన సందర్భంగా సర్‌పై ప్రత్యేకంగా మాట్లాడారు. పార్టీ ఓటర్లను కాపాడటంలో నాయకులు విఫలమైతే ఏ హోదాలో ఉన్నవారిపైనైనా తీవ్ర చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి నుంచి కిందిస్థాయి వరకు అందరూ ఓట్లు కాపాడుకోవడంపైనే దృష్టి సారించాలని నిర్దేశించారు. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమాన్ని సరిగ్గా పర్యవేక్షించలేదని, తెలంగాణలో ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఆ బాధ్యత పూర్తిగా సమన్వయ కమిటీ సభ్యులదేనని పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన డీసీసీ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పనిచేయడంలో వెనుకబడి ఉంటే వారి పనితీరును సీరియస్‌గా సమీక్షించాలని చెప్పారు. వారికి మార్గనిర్దేశం చేయాలని, అప్పటికీ పనితీరులో మార్పు రాకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని సూచించారు. జులై 8తో ముగిసిన నామినేషన్ పోస్టుల భర్తీ అయినా, ఇంకేదైనా కార్యక్రమమైనా సర్ పూర్తయిన తర్వాతే చూద్దామని తరువాయి 2లో




### త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ..

## రూ.10, రూ.20 నోట్ల ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- ప్రయోగాత్మక పరిశీలన కోసం వంద కోట్ల చొప్పున నోట్లను ముద్రించనున్న ఆర్బీఐ
- కాగితం నోట్లను రద్దు చేసే ఆలోచన లేదని ప్రభుత్వం స్పష్టీకరణ
- ఎక్కువ కాలం మన్నిక, నకిలీని అరికట్టడం పాలిమర్ నోట్ల ప్రత్యేకత

2లో



## బిహార్‌లో విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు..

## పోలీసు అధికారి సస్పెన్షన్

- నీట్ పరీక్ష అక్రమాలపై బిహార్‌లో నిరసనలు
- ఏకే-47తో కాల్పులు జరిపిన పోలీసు అధికారి
- ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- శాఖాపరమైన విచారణ ప్రారంభించిన పోలీసులు
- సుప్రీంకోర్టులో దీనిపై దాఖలైన పిల్

## స్టింగ్, రెడ్‌బుల్‌కు షాక్..

## 'ఎనర్జీ డ్రింక్' పదం వాడొద్దని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

fssai

- పెప్సీ, రెడ్ బుల్, మాన్‌స్టర్‌కు నిబంధనలు పాటించేందుకు 90 రోజుల గడువు
- 'శరీరానికి ఉత్తేజం' వంటి ప్రకటనలు తప్పుదారి పట్టించేవిగా గుర్తింపు
- భారత్‌లో 'ఎనర్జీ డ్రింక్స్'కు అధికారిక ప్రమాణాలు లేవన్న నియంత్రణ సంస్థ

2లో




### తత్కాల్ టికెట్ల కోసం

## పశ్చిమ మధ్య రైల్వే కొత్త రూల్స్..

- ఆగస్టు 1 నుంచి మారనున్న టోకెన్ల విధానం!
- ఏసీ, నాన్-ఏసీ టోకెన్ల జారీ సమయాల్లో మార్పులు
- టోకెన్ల కోసం ఆధార్, ఫొటో ఐడీ తప్పనిసరి
- కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించడమే లక్ష్యమన్న రైల్వే అధికారులు

2లో

### భారత వైమానిక స్థావరాలకు దగ్గర్లో చైనా

## అత్యాధునిక ఫైటర్ జెట్లు

- భారత సరిహద్దు సమీపంలో చైనా 11 జే-20 స్టెల్త్ జెట్లను మోహరింపు
- లడఖ్ సమీపంలోని హోటన్ ఎయిర్‌బేస్‌లో ఏడు, అరుణాచల్ వద్ద మరో నాలుగు జెట్లు
- శాటిలైట్ చిత్రాల ద్వారా వెలుగులోకి వచ్చిన చైనా సైనిక సన్నాహాలు



# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ.. రూ.10, రూ.20 నోట్ల ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

దేశంలో ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రూ. 10, రూ. 20 విలువ కలిగిన ప్లాస్టిక్ పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ఈ ప్రయోగాల్లో భాగంగా రూ. 10, రూ. 20 డినామినేషన్లలో వంద కోట్ల చొప్పున పాలిమర్ నోట్లను ఆర్బీఐ జారీ చేయనుంది. భారతీయ వాతావరణ పరిస్థితుల్లో ఈ నోట్ల మన్నిక, పనితీరును పరిశీలించడమే ఈ క్షేత్రస్థాయి పరీక్షల ప్రధాన ఉద్దేశం. ఈ ప్రయోగాలు విజయవంతమైతేనే, వీటిని దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే, ప్లాస్టిక్ పాలిమర్ నోట్లను ప్రవేశపెడుతున్నంత మాత్రాన ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేసే ప్రతిపాదన ఏదీ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగితపు నోట్లతో పాటే పాలిమర్ నోట్లు కూడా సమాంతరంగా చెలామణిలో ఉంటాయని మంత్రి వివరించారు. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉంటాయని, ఇవి సులభంగా పాడవవని ఆర్బీఐ పేర్కొంది. ముఖ్యంగా తక్కువ విలువ కలిగిన నోట్లు త్వరగా చిరిగిపోతుండటంతో, వాటిని తరచూ మార్చాల్సి వస్తోంది. పాలిమర్ నోట్ల వినియోగం వల్ల ముద్రణ మరియు నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## 63 ధిక్కరణ కేసులు భూకబ్జాదారులు వేసినవే

హైదరాబాద్: తనపై ఉన్న 63 ధిక్కరణ కేసులు భూకబ్జాదారులు వేసినవేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. సామాన్యుల ప్లాట్లను, ప్రభుత్వ భూములను కొట్టేయాలని చూస్తున్న బడా భూకబ్జాదారులను అడ్డుకుంటున్నందుకే కేసులు వేశారని, రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తూ, ప్రభుత్వం తనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా వందశాతం ఫలితాలు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. తనను మార్చాలంటూ హైకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో రంగనాథ్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ఆయన పేర్కొన్న అంశాల ప్రకారం.. ''రెండేళ్ల కాలంలో హైడ్రా కమిషనర్‌గా రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 48ఎ ప్రకారం పనిచేస్తున్నా. ఈక్రమంలో మార్కెట్ విలువ ప్రకారం రూ.1.5 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులు రక్షించాం. ఆరు చెరువులు పూర్తిస్థాయిలో పునరుద్ధరించగా.. మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. బడాబాబులు ఆక్రమించిన వందల చెరువులు, పార్కులు, వేల ఎకరాల సర్కారు భూములను హైడ్రా వెనక్కి తెచ్చి ప్రభుత్వానికి అప్పగించింది. భూమాఫియా, భూకబ్జాదారులు తప్పుడు సమాచారంతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. లోతుకుంట భూమి విషయంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన భూమిని శాంతా శ్రీరాం అనే స్థిరాస్తి సంస్థ కొట్టేయాలని చూసింది. అనుమతులు లేకుండా ఎన్నో ఏళ్లనాటి గుట్టలను పేల్చివేస్తూ, వందల చెట్లను ధ్వంసం చేసింది. సేవ్ ద రాక్ సొసైటీ, పర్యావరణవేత్తలతో పాటు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా రంగంలోకి దిగింది. ఎక్కడో మూడు కిలోమీటర్ల దూరంలో ఉండాల్సిన భూమిని ఇక్కడ ఉన్నట్లు చూపిస్తూ ఈ సంస్థ 120 ఎకరాల ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించి, ఆక్రమించి, నాపై న్యాయస్థానం ధిక్కరణ కేసు వేసింది. బతుకమ్మ కుంట చెరువును మింగేయాలని చూసింది ఒకరైతే.. లోతుకుంటలో రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొట్టేయాలని చూసింది ఇంకొకరు.. సామాన్యుల ప్లాట్లు కొట్టేసి, బడా కాంప్లెక్సులు నిర్మించాలని చూసింది మరొకరైతే.. వేల సంఖ్యలో ఉన్న సింగరేణి కార్మికుల ప్లాట్లు కాజేయాలని చూసింది వేరొకరు. మాఫియాగా చలామణి అవుతూ రూ.వేల కోట్ల విలువైన సామాన్యుల ప్లాట్లు, ప్రభుత్వ భూములు ఆక్రమించింది ఇంకొకరు. వీరందరికీ.. హైడ్రా కమిషనర్‌గా అడ్డుపడటమే నేను చేసిన తప్పు. నాపై ఉన్న 63 ధిక్కరణ కేసులు వీళ్లు వేసినవే. వాటిని నేను చట్టబద్ధంగానే ఎదుర్కొంటాను. నాకు న్యాయస్థానాలంటే పూర్తి నమ్మకం ఉంది'' అని పేర్కొన్నారు.

## 'సర్'పై అధిష్ఠానం సీరియస్!

దిల్లీ: రాష్ట్రంలో ఆగస్టు 3వరకు జరిగే సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్ సర్) ప్రక్రియను సీరియస్‌గా తీసుకోవాలని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వాన్ని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ సానుభూతిపరులు, పేదలు, బడుగు, బలహీనవర్గాల ఓట్లు పోకుండా జాగ్రత్తపడాలని నిర్దేశించారు. దీనిపై ఇప్పటివరకు చేసిన కసరత్తుల్లో వచ్చిన ఫలితాలు, క్షేత్రస్థాయి వాస్తవాలను బేరీజు వేసుకొని తక్షణ కార్యాచరణ చేపట్టేందుకు పార్టీప్రభుత్వం మధ్య ఏర్పాటైన సమన్వయ కమిటీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో బుధవారం సమావేశం కావాలని ఆదేశించారు. ఆయన సోమవారం సాయంత్రం ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, వంశీచంద్‌రెడ్డి తదితరులతో తెలంగాణ సంస్థాగత వ్యవహారాలపై సమీక్షించిన సందర్భంగా సర్‌పై ప్రత్యేకంగా మాట్లాడారు. పార్టీ ఓటర్లను కాపాడటంలో నాయకులు విఫలమైతే ఏ హోదాలో ఉన్నవారిపైనైనా తీవ్ర చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి నుంచి కిందిస్థాయి వరకు అందరూ ఓట్లు కాపాడుకోవడంపైనే దృష్టి సారించాలని నిర్దేశించారు. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమాన్ని సరిగ్గా పర్యవేక్షించలేదని, తెలంగాణలో ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఆ బాధ్యత పూర్తిగా సమన్వయ కమిటీ సభ్యులదేనని పేర్కొన్నారు.

## బిహార్‌లో విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు.. పోలీసు అధికారి సస్పెన్షన్

నీట్ పరీక్ష అక్రమాలపై బిహార్‌లో జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా ఏకే 47తో కాల్పులు జరిపిన పోలీసు అధికారిని సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝా సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. జులై 25న నిర్వహించిన 'బిహార్ బంద్' సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. పలు చోట్ల పోలీసులు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను పోలీసులు వినియోగించారు. సివాన్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు గాయపడగా.. వారిలో 15 ఏళ్ల మహ్మద్ ఆరిఫ్ మెడలో బుల్లెట్ తగిలింది. శస్త్రచికిత్స ద్వారా బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ.. ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్, బిహార్‌లో ఏకే47 వినియోగించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మరోవైపు ఘటనపై శాఖాపరమైన విచారణ ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయుధ వినియోగం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందా లేదా అనే అంశాన్ని

### స్టింగ్, రెడ్‌బుల్‌కు షాక్..

## 'ఎనర్జీ డ్రింక్' పదం వాడొద్దని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

అధిక కెఫిన్ కలిగిన పానీయాలను 'ఎనర్జీ డ్రింక్స్'గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పెప్సీ, రెడ్ బుల్, మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి 'ఎనర్జీ డ్రింక్' అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90 రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. భారత్‌లో 'ఎనర్జీ డ్రింక్స్' పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. 'శరీరానికి, మనసుకు ఉత్తేజాన్ని ఇస్తుంది' లేదా 'శారీరక బలహీనతను తగ్గిస్తుంది' వంటి ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడింది. బ్రాండింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలతో గతంలోనే రెడ్ బుల్, పెప్సీకోకు చెందిన స్టింగ్, రిలయన్స్ క్యాంపా ఎనర్జీ వంటి బ్రాండ్‌లకు సంస్థ నోటీసులు జారీ చేసింది. ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈఓ రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది. దేశీయంగా ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా 2017లో పెప్సీ కంపెనీ తక్కువ ధరకే 'స్టింగ్' బ్రాండ్‌ను పరిచయం చేయడంతో యువతలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటికి ఆదరణ గణనీయంగా పెరిగింది. యూరోమానిటర్ అంచనాల ప్రకారం, 2028 నాటికి భారత ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ విలువ 1.6 బిలియన్

## తత్కాల్ టికెట్ల కోసం పశ్చిమ మధ్య రైల్వే కొత్త రూల్స్.. మారనున్న టోకెన్ల విధానం!

రైల్వే స్టేషన్లలో తత్కాల్ టికెట్ల కోసం గంటల తరబడి క్యూలలో వేచి చూసే ప్రయాణికులకు పశ్చిమ మధ్య రైల్వే ఊరటనిచ్చే వార్తను అందించింది. కౌంటర్ల వద్ద రద్దీని నియంత్రించడంతో పాటు, ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. 2026 ఆగస్టు 1 నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్ కోసం సవరించిన టోకెన్ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. నూతన నిబంధనల ప్రకారం, ఏసీ క్లాసుల కోసం ఉదయం 8:30 నుంచి 9:00 గంటల మధ్య, నాన్‌ఏసీ (స్లీపర్) క్లాసుల కోసం ఉదయం 9:00 నుంచి 9:30 గంటల మధ్య టోకెన్లు జారీ చేస్తారు. ప్రతి కౌంటర్‌లో ఏసీ క్లాసుకు గరిష్ఠంగా 10, నాన్‌ఏసీకి 15 టోకెన్లు కేటాయిస్తారు. అయితే, రద్దీ తీవ్రతను బట్టి ఈ సంఖ్యను సవరించే అధికారం స్థానిక అధికారులకు ఉంటుంది. గతంలో టోకెన్లు ఆలస్యంగా జారీ చేయడం వల్ల ప్రయాణికులు రెండుసార్లు కౌంటర్‌కు రావాల్సి వచ్చేది. కొత్త సమయాల వల్ల ఆ సమస్యకు పరిష్కారం లభించనుంది. టోకెన్ల జారీలో పారదర్శకతను పెంచేందుకు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు కఠిన నిబంధనలను రూపొందించారు. టోకెన్ పొందే ప్రయాణికులు తమ ఆధార్ కార్డుతో పాటు ప్రభుత్వం జారీ చేసిన మరో గుర్తింపు కార్డును తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ టోకెన్లు బదిలీ చేయడానికి వీలుండదు. స్వయంగా ప్రయాణించే వారికి లేదా తమ కుటుంబ సభ్యులకు టికెట్లు బుక్ చేసుకునే వారికి (కేటగిరీఏ) మొదటి ప్రాధాన్యత కల్పిస్తారు. ఈ మార్పులను కోటా డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సౌరభ్ జైన్ ధృవీకరించారు. కౌంటర్ల వద్ద తత్కాల్ బుకింగ్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే ఈ



## భారత వైమానిక స్థావరాలకు దగ్గర్లో చైనా అత్యాధునిక ఫైటర్ జెట్లు

భారత సరిహద్దుకు సమీపంలో చైనా తన సైనిక కదలికలను మరోసారి ముమ్మరం చేసింది. తన అత్యాధునిక 'జే20' 'మైటీ డ్రాగన్' స్టెల్త్ ఫైటర్ జెట్లలో కనీసం 11 విమానాలను భారత్‌కు సమీపంలోని రెండు కీలక వైమానిక స్థావరాల్లో మోహరించినట్లు తాజాగా వెల్లడైంది. జూన్ చివరి వారం, జూలై ప్రారంభంలో చేపట్టిన ఈ మోహరింపులకు సంబంధించిన వివరాలు వాణిజ్య ఉపగ్రహ చిత్రాల (కమర్షియల్ శాటిలైట్ చిత్రాలు) ద్వారా వెలుగులోకి వచ్చాయి. జూలై 9వ తేదీ నాటి ఉపగ్రహ చిత్రాల ప్రకారం, జిన్‌జియాంగ్‌లోని హోటన్ ఎయిర్‌బేస్‌లో ఏడు జే20 జెట్లు ఒకేచోట మోహరించి ఉన్నాయి. ఈ వైమానిక స్థావరం లడఖ్‌లోని లేహ్‌కు 389 కిలోమీటర్ల దూరంలో ఉండగా, భారత వాయుసేనకు వ్యూహాత్మకంగా కీలకమైన దౌలత్ బేగ్ ఓల్డీ ఎయిర్‌ఫీల్డ్‌కు కేవలం 245 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఒకే స్థావరంలో ఇన్ని జే20 జెట్లు కనిపించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. మరోవైపు, టిబెట్‌లోని డామ్‌క్సంగ్ ఎయిర్‌బేస్‌లో మరో నాలుగు జే20 జెట్లను గుర్తించారు. ఈ స్థావరం అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌కు సుమారు 344 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పరిణామాలపై మాజీ ఫైటర్ పైలట్ సమీర్ జోషి విశ్లేషిస్తూ, "ఎత్తైన పీఠభూమి ప్రాంతాల్లో ఐదో తరం ఫైటర్ జెట్లను నడపడం చైనా వాయుసేనకు ఇప్పుడు ఒక సాధారణ ప్రక్రియగా మారింది. ఇది కేవలం హెచ్చరిక మాత్రమే కాదు. భారత వాయుసేన ఇకపై ఉత్తర సరిహద్దులో స్టెల్త్ విమానాల ముప్పును ఒక ప్రామాణిక సవాలుగా పరిగణించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కౌంటర్ స్టెల్త్ సెన్సార్లు, సమీకృత వాయు రక్షణ వ్యవస్థల అవసరం ఎంతైనా ఉంది" అని పేర్కొన్నారు. జే20 లోని అత్యాధునిక స్టెల్త్ పరిజ్ఞానం కారణంగా, భారత వాయుసేనలోని రఫేల్ వంటి విమానాల కంటే దీని రాడార్ సిగ్నేచర్ చాలా తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం భారత్ వద్ద పూర్తిస్థాయి స్టెల్త్ ఫైటర్ జెట్‌లు అందుబాటులో లేవు. దేశీయంగా అభివృద్ధి చేస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ క్రియాశీలక వినియోగంలోకి రావడానికి కనీసం మరో దశాబ్ద కాలం పట్టే అవకాశం ఉంది. కాగా, చైనా తన జే20 విమానాల ఉత్పత్తిని వేగవంతం చేస్తోంది. 2026 నాటికి వీటి సంఖ్య 500కు చేరుకోవచ్చని రక్షణ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించండి: సీఎం చంద్రబాబు ఆదేశాలు

- **ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్న సీఎం**
- **ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచన**
- **ప్రజల అంచనాలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలని స్పష్టీకరణ**
- **విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం నిపుణుల సేవలు తీసుకోవాలని ఆదేశం**
- **పనితీరుపై క్షేత్రస్థాయి అభిప్రాయాలను అధికారులకు వివరించిన సీఎం**



ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండనుందన్న అంచనాల నేపథ్యంలో, రైతులను అప్రమత్తం చేసి వారికి పూర్తిస్థాయిలో అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఆయన వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. "ఎల్‌నినో వల్ల ఎదురయ్యే పరిణామాలను రైతులకు స్పష్టంగా వివరించాలి. ఏ ప్రాంతంలో ఏ పంటలు వేయాలో సూచిస్తూ, వారిని ప్రత్యామ్నాయ సాగు వైపు ప్రోత్సహించాలి. దీనికోసం ఒక క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ప్రజల ఆలోచనలకు అనుగుణంగా మారాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు అందడంలో కొంత అంతరం కనిపిస్తోందని అన్నారు. ఇటీవల ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరుపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను ఆయన అధికారుల వద్ద ప్రస్తావించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, దానికి తగ్గట్టుగా ఉద్యోగులు పనిచేయాలని హితవు పలికారు. రంపచోడవరం విద్యార్థిని శివాని ఆత్మహత్య ఘటనపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చదువులో టాపర్‌గా ఉన్న విద్యార్థిని చనిపోవడం బాధాకరమని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు సైకోమెట్రిక్ టెస్టులు నిర్వహించాలన్న విద్యాశాఖ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం నిపుణుల సేవలు తీసుకోవడంతో పాటు, ఉపాధ్యాయులకు కూడా అవసరమైన శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు

# ఏసీ రెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలి

: సీపీఎం మండల కమిటీ



జనగామ / లింగాల ఘణపురం, ప్రజా స్ఫూర్తి : కామ్రేడ్ ఏసీ రెడ్డి నరసింహారెడ్డి 35వ వర్ధంతి సభను విజయవంతం చే యాలని కోరుతూ సీపీఎం మండల క మిటీ ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ వి గ్రహం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల నాయకుడు తూటి దేవదానం మాట్లాడుతూ ఏ.సీ రెడ్డి రైతాంగం,పేదల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడా రు. ఇల్లు లేని పేదలకు పట్టాలు ఇవ్వా లని, డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు విద్యు త్ సౌకర్యం కల్పించాలని, రైతులకు ఎ రువులు అందుబాటులో ఉంచాలని ప్ర భుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో సీపీఎం నాయకులు బర్ల కృష్ణ మూర్తి,గండి అంజయ్య, గోసంగి ఎల్ల య్య, నక్క మంజుల, అమ్మడాల ఎల్ల య్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళ



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన దుకాణాల వారిచే రైతుల కోసం విత్తనమేళ ను ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అంజని దేవి మాట్లాడుతూ ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో రైతులు ఆరుతడి పంటలైన కందులు, పెసర్లు, కూరగాయలు వంటి వాటిని సాగు చేసుకోవాలని వాటిని వివిధ షాపుల్లో అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘురామ ఫర్టిలైజర్స్, బాలాజీ ట్రేడర్స్, నరేంద్ర కమిషన్ జనరల్ మర్చంట్, గణేష్ ట్రేడర్స్, శ్రీనివాస ట్రేడర్స్ యజమానులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

* భువనగిరి మండల విద్యాధికారి రంగరాజన్



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : వాలీబాల్ లా పోలి ఉండే ఒక ప్రసిద్ధ ఆగ్నేయాసియా క్రీడ సెపక్ తక్రా అని భువనగిరి మండల విద్యాధికారి రంగరాజన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో అస్మిత క్రీడలో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లా సెపక్ తక్రా లీగ్ లో విజయం సాధించిన క్రీడాకారులకు మెడల్స్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలురతోపాటు బాలికలకు సమానత్వం కల్పించడానికి సేపక్ తక్రా క్రీడను బాలిలకల కోసమే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించారన్నారు. ఖేలో ఇండియా కోచ్ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ అస్మిత క్రీడల అబ్జర్వర్ డాక్టర్ జీవి సుబ్బారావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి విద్యార్థి క్రీడలను అలవర్చుకోవాలన్నారు. సెపక్ తక్రా లో క్రీడలో చేతులు ఉపయోగించకుండా మోకాళ్లు తల చాతి తో మాత్రమే ఆడతారన్నారు. ఈ లీగ్ లో రాష్ట్ర తపక్ సక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర కోశాధికారి వికేష్ కుమార్ ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు జితేందర్ రెడ్డి కరస్పాండెంట్ లు రఘు సురేష్ కుమార్ దుర్గాప్రసాద్ యాదయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా విద్యానగర్ కాలనీ సర్పంచ్ జన్మదిన వేడుకలు




ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : చుంచుపల్లి మండలంలో గల విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు . ముందుగా సర్పంచ్ పంచాయతీ సిబ్బంది సమక్షంలో కేక్ కటింగ్ చేశారు . ఈ సందర్భంగా ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలను ఎన్నో జరుపుకోవాలని , కుటుంబ సమేతంగా సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు . అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ పార్వతమ్మ , పంచాయతీ గుమస్తా బండ రామకృష్ణ , బిల్ కలెక్టర్లు కిషోర్, బోస్ , కంప్యూటర్ ఆపరేటర్ మేఘన , శానిటేషన్ సూపర్వైజర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు .

# కోమటిరెడ్డి బ్రదర్స్ కు ఎమ్మెల్యే మందుల సామేలు బహిరంగ క్షమాపణ చెప్పాలి

: చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ కోమటిరెడ్డి బ్రదర్స్ కు భేషరతుగా క్షమాపణ చెప్పాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారంలోని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ అన్ని కులాల ఓట్లతో 50వేల మెజార్టీతో గెలిచిన మందుల సామెల్ దళితుల కార్డుతో తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో కొత్త పంచాయతీ తీసుకువస్తున్నాడని ఆరోపించారు. తుంగతుర్తిలోని 66వేల దళితుల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో రాజగోపాల్ రెడ్డి దయవల్లే టికెట్ వచ్చిందని చెప్పిన సామెల్, ప్రస్తుతం ఎవరి దయా వల్ల టికెట్ రాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే తప్పును కప్పిపుచ్చుకోవడం వల్ల కులం ప్రస్తావన తీసుకొస్తున్నాడని ఆరోపించారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించిన ఏ ఒక్క దళితునికి సామెల్ పదవులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేయకుండా నీ అభివృద్ధి కోసమే పాలన కొనసాగిస్తున్నావని విమర్శించారు. తుంగతుర్తి కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అన్యాయం జరగొద్దని చేసిన రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలలో తప్పేముందో చెప్పాలన్నారు. మంత్రి వెంకట్ రెడ్డి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుని కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తే నీకు కలిగిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ సెల్ ఉపాధ్యక్షునిగా నీ పెద్ద కొడుకుకి, రెండో కొడుకుకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నావని ఆరోపించారు. నీ కొడుకులు నియోజకవర్గంలోని ఏ కార్యకర్తను, నాయకుడిని ఆదుకున్నారో చెప్పాలన్నారు. 20సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో నికార్స్ అయిన కార్యకర్తగా పనిచేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు పదవులు ఇవ్వకుండా, కాసుల కక్కుర్తి కోసం మండల అధ్యక్ష పదవులు అమ్ముకోవడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణి స్త్రీలకు సామూహిక శ్రీమంతం కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని రవి మహల్ నందు త్రిశక్తి వనిత గ్రూప్ నిర్వాహకులు పసుపర్తి జ్యోతి కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో 30 మంది గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీధ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ త్రిశక్తి వనిత గ్రూప్ ఆధ్వర్యంలో గర్భిణి స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ మహిళలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొట్టు పెట్టి గాజులు తొడిగారు. అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం కార్యక్రమంలో నిర్వాహకులు పసుపర్తి జ్యోతి కృష్ణమూర్తి మాట్లాడుతూ తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. స్వర్ణ కంచి షోరూం, శ్రేష్ట హాస్పిటల్ నిర్వాహకులు మీలా సందీప్, మమత డెకరేషన్ కు ధన్యవాదాలు తెలిపారు. దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు, దేవాలయాలకు కుర్చీల బహూకరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. గర్భిణీ స్త్రీలకు పెద్ద తాంబాలంలో ఇరవై ఒక్క వస్తువులు మరియు రెండు బోజన ప్లేట్లు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

* జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 134 అర్జీలను స్వీకరించారు.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. వచ్చిన దరఖాస్తుల లో రెవిన్యూ శాఖ 64 , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 17, సర్వే ల్యాండ్స్ 8, మున్సిపాలిటీ 8,డి.పి. ఓ 6, మైనింగ్ 4, ఉపాధి కల్పన 3, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య 2,ఇరిగేషన్ 2,జిల్లా పరిషత్ 2, వ్యవసాయ 2,విద్య శాఖ 2, సివిల్ సప్లై,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,విద్యుత్,ఎల్.డి.ఎం, డి సి.ఓ ఆర్టీసీ,హౌసింగ్, చేనేత మరియు జౌళి ,కోపరేటివ్,పౌర సంబంధాలు,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ స్టేట్ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి కి బదులు ప్రత్యామ్నాయ (తక్కువ నీటి) పంటలు వేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ నెల 28వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎల్ ని నో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ సాగునీటి వినియోగం తదితర అంశాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మండల స్పెషల్ అధికారులకు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు



# ప్రతి ఫంక్షన్ హాల్స్ యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

* స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సోమవారం అడిషనల్ ఎస్పీ లక్ష్మి నారాయణ తో కలసి అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సమీక్ష నిర్వహించారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఫంక్షన్ హాల్స్ యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో పర్యావరణ పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, నీటి సంరక్షణకు సంబంధించిన ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఫంక్షన్ హాల్ యజమాని తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు ఫంక్షన్ హాల్స్‌ను సీజ్ చేసే వరకు కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు హెచ్చరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు బాల కార్మికులు లేదా మైనర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ పనిలో నియమించరాదని స్పష్టం చేశారు. ఫంక్షన్ హాల్స్‌లో ఒకసారి వినియోగించి పారవేసే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, చెంచాలు, ఫోర్కులు తదితర వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. వాటి స్థానంలో స్టీల్ పాత్రలు,ఆకుల విస్తర్లు, కాగితంతో తయారైన పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు వంటలు, శుభ్రపరిచే పనులకు అవసరమైన మేరకే నీటిని వినియోగించాలని,కుళాయిలు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, వాడిన నీటిని తోటల నిర్వహణ, శుభ్రత పనులకు పునర్వినియోగం చేయాలని సూచించారు.ప్రతి ఫంక్షన్ హాల్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ లేని ఫంక్షన్ హాల్స్‌కు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు.ఈ నాలుగు నిబంధనలను అమలు చేయని ఫంక్షన్ హాల్స్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ట్రేడ్ లైసెన్సులను రద్దు చేసి ఫంక్షన్ హాల్స్‌ను సీజ్ చేస్తామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధన, పర్యావరణ కాలుష్య నియంత్రణ, భూగర్భ జలాల పరిరక్షణలో ఫంక్షన్ హాల్స్ యజమానులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో భువనగిరి మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పట్టణంలోని ఫంక్షన్ హాల్స్ యజమానులు పాల్గొన్నారు.

# ఘనంగా విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారం



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని సెంట్ మేరీస్ హైస్కూల్ లో సోమవారం విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పద్మ శ్రీదేవి, ప్రి న్సిపాల్ శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ కల్నల్ మాచర్ల భిక్షపతి, షీ టీమ్ ఎస్ఐ లలిత, కౌన్సిల ర్ పాముకుంట్ల ప్రసాద్ ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతనంగా ఎన్నికైన విద్యార్థి నా యకులతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు,క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అలవర్చుకో వాలని సూచించారు. తోటి విద్యార్థుల కు ఆదర్శంగా నిలుస్తూ,మంచి పౌరులు గా ఎదిగి రాజ్యాంగం, చట్టాలను గౌర వించాలని, విద్యలో రాణిస్తూ సమాజా నికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాల ని ఆకాంక్షించారు. పాఠశాల యాజమా న్యం నూతన విద్యార్థి నాయకులకు శు భాకాంక్షలు తెలియజేస్తూ, బాధ్యతల ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించింది. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# సుజాతనగర్ మండల సమగ్ర అభివృద్ధికి నిరంతర కృషి

* ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల రూపురేఖలు మార్చేలా సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండల పరిధిలోని కార్పొరేషన్ డివిజన్‌లో రూ.1.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, బస్ షెల్టర్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుజాతనగర్ కార్పొరేషన్ ప్రాంతంగా మారిన తర్వాత మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించామని ,ప్రతీ గ్రామంలో తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, సుజాతనగర్ నుండి శివాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన అంటూ , కొత్తగూడెం నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సొసైటీ అధ్యక్షులు మండే హనుమంతరావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మున్సిపల్ కమిషనర్ సుజాత, కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, పలువురు అధికారులు , స్థానిక నాయకులు పాల్గొన్నారు .

# అంగవైకల్యకుడి కోరికను.. తీర్చిన మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి

ప్రజాస్ఫూర్తి, మేడ్చల్ జిల్లా : మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడకు చెందిన రాహుల్ పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్నాడు రెండు కాళ్లు ఉన్నప్పటికీ నడవలేని పరిస్థితి మాటలు కూడా అంతంత మాత్రమే మాట్లాడుతాడు పుట్టుక నుండే నడవలేని స్థితిలో అనునిత్యం ప్రతిక్షణం ప్రతిరోజు అంగవైకల్యంతో బాధపడుతున్నాడు ప్రకాశం జిల్లా కందుకూరు నుండి వలస వచ్చిన తిరుమలరావు రాధమ్మ దంపతుల ప్రథమ కుమారుడు రాహుల్ పుట్టుకతోనే అంగవైకల్యంతో జన్మించాడు ఆ కుటుంబానికి కూడా పెద్ద భారంగా మారింది ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ రష్మిత దృష్టికి తీసుకురావడంతో ఒక వీల్ చైర్ ను రాహుల్ కి ఇప్పించి మానవత దృక్పతాన్ని చాటుకున్నారు వికలాంగులు కాలుండి నడవలేని స్థితిలో ఉన్న వారిపట్ల స్వచ్ఛంద సంస్థలు దయా కరుణ ప్రేమ చూపించాలని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి అన్నారు. అంగవైకల్యంతో అయిన రాహుల్ కి పోలీస్ అధికారి కావాలని ఆకాంక్ష ఒక రోజైనా పోలీస్ స్టేషన్ లో ఎస్ హెచ్ ఓ కుర్చీలో కూర్చోవాలని అతని కోరిక అట్టి కోరికను ఈరోజు మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి తన కుర్చీలో కూర్చోబెట్టి టోపీని పెట్టి నీ కోరిక తీరిందా! రాహుల్ అని ఆప్యాయంగా పలకరించింది.

# సర్పంచులకు నిధులు ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తాము



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్స్‌లో తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ ఆధ్వర్యంలో జిల్లా సర్పంచుల చైతన్య సదస్సు ఉమ్మడి వరంగల్ జిల్లా సర్పంచ్ల ఫోరం కన్వీనర్ గునిగంటి కమలాకర్ గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. సర్పంచుల చైతన్య సదస్సుకు ముఖ్య అతిథిలు, సర్పంచులు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో సర్పంచుల పాత్రను మరింత బలోపేతం చేయడం, స్థానిక సంస్థల హక్కులను కాపాడటమే ధ్యేయంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి సర్పంచులు ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సర్పంచులు తమ రోజువారీ విధుల్లో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఈ వేదికగా సుదీర్ఘంగా చర్చించారు. గ్రామపంచాయతీల బలోపేతానికి అవసరమైన నిధుల విడుదల, స్థానిక సంస్థల అధికారాల పరిరక్షణపై సర్పంచులకు సమగ్ర అవగాహన కల్పించారు. గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షులు, చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని, అప్పటి భారత ప్రధాని రాజీవ్ గాంధీ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు 29 అంశాలను ప్రవేశ పెట్టడం జరిగింది. పలు రాష్ట్రాలు గ్రామ పంచాయతీలోని అంశాలను నెరవేర్చాలని ఈ సందర్భంగా చెప్పారు. గత ప్రభుత్వంలో 2018 పంచాయతీరాజ్ చట్ట సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు బదలాయించింది. గ్రామపంచాయతీలో నీ వనరులు గ్రానైట్, భూముల కయ, విక్రయాలు వచ్చే ఆదాయాలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం జరిగింది. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలు గ్రామాలలో అభివృద్ధికి అడ్డుపడుతున్న ఉపసర్పంచ్ లకు చెక్ పవర్ రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కరెంట్ బిల్లులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి, నెలలో ఒక్కరోజు కలెక్టర్లు జిల్లాలోని సర్పంచ్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసి గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా దృష్టి సారించాలి, ఎమ్మెల్సీ ఎలక్షన్లో సర్పంచులకు కూడా ఓటు హక్కు కల్పించాలి, ఆరు నెలలకు ఒకసారి రాష్ట్ర ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సర్పంచ్లతో మీటింగ్ ఏర్పాటు చేయాలి, ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మందిపల్లి వెంకట్ రాష్ట్ర కార్యదర్శి, నరేందర్, శ్రీనివాస్, గునుగంటి కమలాకర్ గౌడ్ ఉమ్మడి వరంగల్ జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్, సర్పంచులు పెరుమాండ్ల గుట్టయ్య, ప్రవీణ్ నాయక్, ఏకాంతం గౌడ్, కొత్త హేమంత్, ఆయుఖాన్, కాల్ నాయక్, పృథ్వీరాజ్, పార్వతి, లక్ష్మణ్ నాయక్, వివిధ గ్రామాల చెందిన సర్పంచులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్స్ ఉద్యోగులకు ప్రతి నెల 1న జీతం

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణిలో ప్రజలు సమర్పించే అర్జీలను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి సత్వరమే పరి ష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కు మార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లోమ్ తో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భం గా మొత్తం 410 దరఖాస్తులు అందగా, వాటిని శాఖల వారీగా పరిశీలించి త్వరి తగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారు లతో నిర్వహించిన సమావేశంలో కలెక్ట ర్ మాట్లాడుతూ, ఔట్ సోర్స్ ఉద్యోగుల కు ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు అందేలా అన్ని శాఖలు ముందస్తు చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. వేతనా ల చెల్లింపులో జాప్యం లేకుండా బిల్లుల ను నిర్ణీత గడువులో సమర్పించాలని సూచించారు. జిల్లాలో ఔట్ సోర్స్ ఉద్యో గుల నిర్వహణ వ్యవస్థ పారదర్శకంగా కొనసాగుతోందని, ఉద్యోగుల వివరాల నిర్వహణ, హాజరు నమోదు, బిల్లుల సిద్ధీకరణ, వేతనాల చెల్లింపులో సమర్థ వంతమైన విధానాన్ని అమలు చేస్తు న్నామని తెలిపారు. ఈ విధానం ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోంద ని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మా తృ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికా రులు పాల్గొన్నారు.

## మహిళల గళం గెలిచింది

*** దర్గాపల్లిలో మద్యపాన నిషేధానికి గ్రామసభ ఆమోదం**



సిద్దిపేట జిల్లా, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, దర్గాపల్లి మహిళల ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామ సర్పంచ్ పెంబర్ల శైలజ రమేష్ యాదవ్ అధ్యక్షతన, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో జరిగింది. ఈ గ్రామసభలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్యపానం వల్ల కుటుంబాలు, యువత, సమాజంపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను వివరించారు. అనంతరం గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంబర్ల శైలజ రమేష్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సహకారంతో మద్యపానాన్ని పూర్తిగా నిర్మూలించి, ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన, ఆదర్శ గ్రామంగా దర్గాపల్లిని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వర్షా లు సమృద్ధిగా కురవాలని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి కొండపై వరుణ యాగం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వర్షాలు సమృద్ధిగా కురువాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం వెంకటాపురం శ్రీ మచ్చగిరి లక్ష్మీనరసింహస్వామి కొండపై వరణ యాగాన్ని నిర్వహించారు వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పంటలు బాగా పండించాలని ప్రజలంతా సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారికి పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కే వెంకటయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వరి వద్దు.. ఆరుతడి పంటలే సాగు చేయండి

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ఎల్‌నినో కారణంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితు లను దృష్టిలో ఉంచుకుని రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పం టల వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ సందీ ప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. సోమ వారం మండలం ఓబుల్ కేశవాపూర్ రై తు వేదికలో వ్యవసాయశాఖ నిర్వహిం చిన విత్తన మేళాను ఆయన ప్రారంభిం చి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్ర భుత్వం ధ్రువీకరించిన నాణ్యమైన విత్త నాలను రైతులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచిందని, రైతులు వి త్తన మేళాను సద్వినియోగం చేసుకుని తమ ప్రాంతానికి అనువైన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇం టిగ్రేటెడ్ వ్యవసాయ విధానంలో పంట లతో పాటు ఉద్యానవనం, పశుసంవర్ధ క రంగం, కూరగాయల సాగును చేపడి తే ఏడాది పొడవునా ఆదాయం పొంద వచ్చన్నారు. మేత పంటల సాగుకు ప్ర భుత్వం 75 శాతం సబ్సిడీ అందిస్తోంద ని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవాలని కోరారు. జిల్లాలో నాణ్యమై న విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ఏర్పాట్లు చేశామని, రైతులకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అంది స్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీధర్ రావు, ఉపసర్పంచ్, వ్యవ సాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలుకు ప్రత్యేక చర్యలు

*** జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జిల్లాను తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ మోడల్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జిల్లాలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ఎం. మనోహర్ తెలిపారు. జిల్లాలోని అన్ని నమోదిత ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫార్మసీలు మెడికల్ షాపులకు సంబంధించిన హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ వైద్యులు, ఆరోగ్య నిపుణులకు సంబంధించిన హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ నమోదును 39 ప్రత్యేక బృందాల ద్వారా పూర్తి చేసినట్లు డా. మనోహర్ తెలిపారు. తదుపరి దశలో ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫార్మసీలు, మెడికల్ షాపులు లేబొరేటరీలలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సమర్థవంతమైన అమలు కోసం జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ ఆరోగ్య సంస్థల వైద్యులు, ఆరోగ్య నిపుణులు యాజమాన్య ప్రతినిధులకు ఒకరోజు అవగాహన వర్క్‌షాప్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు, ఆరోగ్య సమాచారాన్ని సురక్షితంగా డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకురావడం, ఆరోగ్య సేవల్లో పారదర్శకత, సమర్థతను పెంచడం ప్రధాన లక్ష్యమని డా. మనోహర్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ, హెల్త్కేర్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ పర్సనల్ హెల్త్ రికార్డ్స్ యూనిఫైడ్ హెల్త్ ఇంటర్‌ఫేస్ వంటి ముఖ్యమైన డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలు పనిచేస్తాయని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన తెలిపారు ఈనెల 29న పట్టణంలోని ఐడిఓసి కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించనున్న ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వర్క్‌షాప్‌కమ్అవేర్‌నెస్ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్ డయాగ్నస్టిక్ సెంటర్ల మేనేజింగ్ డైరెక్టర్లు/యాజమాన్య ప్రతినిధులు, అలాగే ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి, నర్సింగ్ హోమ్ క్లినిక్ నుండి ఒక వైద్యుడు తప్పనిసరిగా హాజరు కావాలని ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై ఉన్నతాధికారులు అవగాహన సదస్సు నిర్వహిస్తారని డా. మనోహర్ తెలిపారు.

## ఐఎన్టియుసి కోర్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎండి రజాక్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అధ్యక్షతన గోదావరిఖనిలో సోమవారం సింగరేణి ప్రస్తుత పరిస్థితులు, నూతన బొగ్గు గనుల సాధన, పెండింగ్ హామీల అమలు, 12వ జెబిసిసిఐ వేజ్ బోర్డు ఏర్పాటు అంశాలపై కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ నాయకులు ఐఎన్టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్, సింగరేణి 12 ఏరియాలో వైస్ ప్రెసిడెంట్లు, కోర్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరిన్ని బొగ్గు బ్లాకులను సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని, కార్మికుల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 12వ జేబీసీసీఐ వేజ్ బోర్డును తక్షణమే ఏర్పాటు చేసి వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని తీర్మానించారు. కార్మికులకు సంబంధించిన పెండింగ్ హామీల అమలు, ఆదాయపు పన్ను రాయితీ, సొంత ఇంటి పథకం అమలు, మారుపేర్లు, విజిలెన్స్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు.. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు త్యాగరాజన్, ఆల్బర్ట్, తీగల క్రాంతి కుమార్, పితాంబర్రావు, కృష్ణంరాజు, వెంకటేశ్వర్లు కోటేశ్వర రావు పాల్గొన్నారు.

## ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు కృషి చేయాలి

*** బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మంజిల్లా : ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. సోమవారం బోనకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషధాల లభ్యత, వార్డుల నిర్వహణ, రోగుల నమోదు విధానం, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైద్యులు సమయానికి అందుబాటులో ఉంటున్నారా, అవసరమైన పరీక్షలు, మందులు సకాలంలో అందుతున్నాయా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని కలెక్టర్ ఆరా తీసారు. ఆసుపత్రిలోని ఔషధ నిల్వల గదిని పరిశీలించిన కలెక్టర్ అత్యవసర మందులతో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన స్టాక్‌ను నిర్వహించాలని సూచించారు. మందుల వినియోగం, గడువు తేదీలు, నిల్వల నమోదును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట బోనకల్ తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎల్డీఎంగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : జిల్లా నూతన లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్డీఎం)గా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఇంతకుముందు ఎల్డీఎంగా పనిచేసిన తిరుపతి హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగరాజును నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. జిల్లాభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పట్నం కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరం, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజులు




వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : పట్నం మహేందర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డిల తల్లి రుక్కమ్మ మృతి చెందిన నేపథ్యంలో షాబాద్ లోని వారి నివాసానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు లు వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారితో పాటు పట్నం అవినాష్ రెడ్డి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రుక్కమ్మ పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కొలన్ ప్రభాకర్ రెడ్డి, పూడూరు మాజీ జెడ్పిటిసి సత్యనారాయణ రెడ్డి, నర్సింగ్ రావు, ధర్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు వారితో ఉన్నారు

## సూర్యాపేట అభివృద్ధే లక్ష్యం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 9వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో మురికి కాలువపై బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ నుంచి మంజూరైన రూ.5 లక్షల నిధులతో చేపడుతున్న ఈ పనుల ద్వారా స్థానికుల రాకపోకలు సులభతరం అవుతాయని ఆమె తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే 9వార్డు నుంచి కొన్ని సమస్యలు వచ్చాయని వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, స్థానిక కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు బంటు చోక్కయ్య, మన్నెం మల్లేష్, కోడి శివ, జానయ్య, వీరమల్ల రవి చరణ్, జవాను శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి రూ.1లక్ష ఆర్థిక సాయం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతినగర్‌కు చెందిన తరుణ్ కుమార్ దంపతుల 20 రోజుల చిన్నారి అరుదైన ఎంఎంసి వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఏఎండీఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఛేంజ్ వ్యవస్థాపకులు మహమ్మద్ ఆదిల్ సోమవారం ఫౌండేషన్ తరపున రూ. 1 లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్నారి తల్లిదండ్రులకు ఆ మొత్తాన్ని ఇచ్చి చిన్నారి త్వరగా కోలకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆదిల్ మాట్లాడుతూ సమాజంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అవసరమైన సందర్భాల్లో పేద, నిరుపేద కుటుంబాలకు తమ ఫౌండేషన్ ద్వారా నిరంతరం సహాయం అందిస్తామని తెలిపారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వనరులను పరిరక్షించాలి

* **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నీటి వనరులను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.సోమవారం మధిర మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడటంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు కూడా క్రమంగా తగ్గుతున్నందున రైతులు సాగు ప్రణాళికలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా కంది, పెసర, మినుములు, జొన్న, సజ్జలు,



కూరగాయలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు.

* **యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి**

వానాకాలం2026 సీజన్‌కు ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించబడిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 231.77 మెట్రిక్ టన్నులు (5,150 బస్తాలు), సహకార సంఘాల వద్ద 2,292.25 మెట్రిక్ టన్నులు (50,938 బస్తాలు), మార్క్‌ఫెడ్ ఖమ్మం వద్ద 3,153.96 మెట్రిక్ టన్నులు (70,088 బస్తాలు), సీఆర్‌పీ కమిషనర్ రిజర్వ్ పూల్‌లో 7,698.355 మెట్రిక్ టన్నులు (1,71,074 బస్తాలు), కంపెనీ గోదాముల్లో 991 మెట్రిక్ టన్నులు (22,022 బస్తాలు) అందుబాటులో ఉన్నాయని వివరించారు. మొత్తం 3,19,272 యూరియా బస్తాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు యూరియా యాప్ ద్వారా 1,27,377 మంది రైతులు 3,90,762 బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 3,52,172 బస్తాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎటువంటి యూరియా కొరత లేదని, రైతులు అనవసర ఆందోళన చెందకుండా తమ సమీపంలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల నుంచి అవసరమైన యూరియాను కొనుగోలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ బండారు నరసింహారావు, సిపిఓ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

* **రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 43వ డివిజన్‌లో రూ.61.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ ఖమ్మం నగర అభివృద్ధికి వందల కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమానికి హామీలు అమలు చేయాలి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు సోమవారం భూపాలపల్లి ప్రెస్‌క్లబ్‌లో పట్టణ అధ్యక్షుడు యాళ్ల సురేందర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం నియమించిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఉద్యమకారులు, ఉద్యమ సంఘాలతో సంప్రదింపులు పూర్తి చేసిన నేపథ్యంలో ఇకపై కాలయాపన చేయకుండా కాలపరిమితి విధించి గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేసేందుకు వెంటనే కార్యాచరణ ప్రారంభించి తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పైడిపల్లి రమేష్, రాష్ట్ర నాయకులు పున్నం రవి, కత్తి సంపత్, రాష్ట్ర మహిళా కార్యదర్శి బందెల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

* **అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి స్వయంగా వినతులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి సంబంధించిన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 71 దరఖాస్తులు అందాయని తెలిపారు. స్వీకరించిన అర్జీలను తగిన చర్యల నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి, భూపాలపల్లి ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌ను విచ్ఛిన్నం చేసే చర్యలు మానుకోవాలి

* **మాజీ స్పీకర్ మధుసూదనాచారిని ప్రశ్నించిన బీఆర్ఎస్ కార్యకర్తలు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : భూపాలపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని విచ్ఛిన్నం చేసే చర్యలకు స్వస్తి పలకాలని ఆ పార్టీ పట్టణ కార్యకర్తలు కోరారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయాలకు అనుగుణంగా కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ.. భూపాలల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి కొనసాగుతున్నారని, ఆయన నాయకత్వంలోనే పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి కుమారుడు ఇటీవల నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు పార్టీ శ్రేణుల్లో అయోమయానికి దారితీస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరిగా మధుసూదనాచారి అంటే తమకు ఎంతో గౌరవం, అభిమానం ఉందని, అయితే పార్టీ విధివిధానాలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత ఆకాంక్షలు, ప్రకటనలు పార్టీ అధిష్ఠానం నిర్ణయాలకు భిన్నమైన సంకేతాలను పంపించేలా ఉండకూడదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై పార్టీ అధిష్ఠానం దృష్టి సారించి, పార్టీ శ్రేణులకు స్పష్టమైన మార్గదర్శకత్వం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. వ్యక్తుల కంటే పార్టీ సిద్ధాంతం, క్రమశిక్షణ, అధిష్ఠానం నిర్ణయాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కేసీఆర్ ఆశయాలు, కేటీఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ భూపాలపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గో సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి



జనగామ, ప్రజాస్ఫూర్తి : "గోసమ్మాన్ ఆహ్వాన్ అభియాన్" లో భాగంగా జిల్లా హిందూ సంఘాల నాయకులు, గో ప్రేమికులు సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు వినతిపత్రాన్ని సమర్పించారు. గో సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతో పాటు, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వా నికి సిఫారసు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో హిందూ నాయకులు, సంస్థ ప్రతినిధులు ఎనగందుల బిక్షపతి, డాక్టర్ మోహనకృష్ణ భార్గవ, పాశం శ్రీ శైలం, అంబటి బాలరాజు, చిలువేరు హర్షవర్ధన్, మాసరాజు, బత్తిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు పురోగతి పరిశీలించిన మంత్రి తుమ్మల



ప్రజాస్ఫూర్తి, ఖమ్మంజిల్లా : నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు పురోగతి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరంలో వరద గండం లేకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఖానాపురం చెరువు అలుగు వరద పోటెత్తగా అనేక డివిజన్లు ముంపుకు గురయ్యాయని మంత్రి అన్నారు. వర్షాల వరద నీటిని తరలించేందుకు వంద కోట్ల తో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం నగరానికి తాగు నీటి ఎద్దడి లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు మంత్రి అన్నారు. కృష్ణా నది నీళ్లు సరఫరా కానీ పక్షంలో గోదావరి నీళ్లతో పరిష్కారం చేయనున్నామన్నారు. గోదావరి జలాలు మున్నేరు వరకు తరలించామని తెలిపారు.ఖమ్మం నగరంలో వరద ముంపు తాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. 200 కోట్లతో అమృత్ పథకం పనులు సాగుతున్నాయన్నారు. ఆటోమేషన్ విధానంలో అమృత్ పథకం ద్వారా రక్షిత తాగునీరు సరఫరా చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో తాగు నీటి పథకం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సీట్ల కేటాయింపుపై కలెక్టర్ విచారణ జరపాలి

* **ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి: ఏబీవీపీ**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) పాఠశాలలో 9వ తరగతి, ఇతర తరగతుల్లో సీట్ల కేటాయింపులపై సమగ్ర విచారణ జరపాలని ఏబీవీపీ తెలంగాణ ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష రాయకుండా ఎమ్మెల్యే, కార్యదర్శి లేఖల ఆధారంగా కొందరికి సీట్లు కేటాయించారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. పరీక్ష రాసి అర్హత సాధించిన విద్యార్థులకు అన్యాయం జరిగితే, ఖాళీగా ఉన్న సీట్లకు బ్యాక్‌లాగ్ పరీక్ష నిర్వహించి అర్హులైన వారికి అవకాశం కల్పించాలని కోరారు. సీట్ల కేటాయింపులు, పాఠశాల నిధుల వినియోగంపై తక్షణమే ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సన్నీ, వితేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : మధిర లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహార అల్పాహారం అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా అల్పాహార కార్యక్రమం భవిష్యత్ లో దిగ్విజయంగా ముందుకు సాగాలని జరిపించిన నృసింహ మహా యాగంలో పాల్గొన్న అనంతరం సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. విద్యార్థులకు అల్పాహారంతో పాటుగా అందించే మిల్క్ యూనిట్ ను ప్రారంభించారు. అల్పాహారం తయారు చేసే యంత్రాలను, కూరగాయలాంజ్ శుద్ధిచేసే మెషీనరీని, ఇతర అన్ని రకాల ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అల్పాహారం చేశారు. ఇడ్లీ, పొంగల్, ఉప్మా, పూరీ, రాగి ఇడ్లీ, ఇతర వంటకాలను ఆయన రుచి చూసారు.అల్పాహారం సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యార్థులకు ఇడ్లీలు, ఇతర వంటకాలను వడ్డించారు. భట్టి విక్రమార్క వడ్డించే సమయంలో ఆయనతో మాట్లాడేందుకు, చేయిని కలిపేందుకు విద్యార్థులు ఎంతో ఉత్సాహాన్ని చూపారు. అనంతరం వివిధ పాఠశాలలకు అల్పాహారాన్ని అందించే వాహనాలను ఉప ముఖ్యమంత్రి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు.

# ఆరుతడి పంటలను రైతులు ప్రోత్సహించాలి

* **మండల వ్యవసాయాధికారిని జ్యోతి**



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : ఆరుతడి పంటలను రైతులు ప్రోత్సహించాలని మండల వ్యవసాయాధికారిని జ్యోతి రైతులకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుండి ఈ నెల 29 వరకు నవాబుపేట రైతువేదిక లో విత్తనమే ళా నిర్వహించారు. మండలం లో ఉన్న సీడ్ డీలర్ లు రైతువేదికలో విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది. వరీ కి ఎక్కువ వర్షపాతం అవసరం కాబట్టి వరి కి బదులుగా ఆరుతడి పంటలైన కంది, వామ, మొక్కజొన్న, అన్ని రకాల కూరగాయల విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయాధికారిని జ్యోతి ఎల్ నినో ప్రభావం పరిస్థితిని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండలములోని ఏఈఓలు పవన్ ,లక్ష్మి ,మదన్ ,మల్లేష్ ,రాజు , ఉద్యాన శాఖా హెచ్ ఈఓ లక్ష్మయ్య ,రైతులు , సీడ్ డీలర్లు పాల్గొన్నారు

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 12 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి, వాటిని శ్రద్ధగా విన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు.

## మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా ఎస్. విజయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) గా ఎస్. విజయ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఎస్ లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటి వరకు మల్కాజిగిరి సీఐగా పనిచేసిన సత్యనారాయణ ఆర్థిక నేరాల విభాగం కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సత్యనారాయణకు పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికి, ఆయన సేవలను అభినందించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ ఎస్. విజయ్ కుమార్‌ను స్టేషన్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నూతన సీఐకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా స్వాగతం పలికారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ఈ సందర్భంగా నూతన సీఐ ఎస్. విజయ్ కుమార్ పేర్కొన్నట్లు సమాచారం.

## హెచ్ పివీ వ్యాక్సిన్ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం

*** సి హెచ్ ఓ సుష్మ**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : ఆడపిల్లల భవిష్యత్తు కోసం 14 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు హెచ్ పివీ వ్యాక్సిన్ రక్షణ కవచంగా కాపాడుతుందని విద్యానగర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిహెచ్ఓ సుష్మ అన్నారు . సోమవారం నాడు చుంచుపల్లి మండల కేంద్రంలో ఉన్న బాబు క్యాంపు హై స్కూల్ నందు పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా సుష్మ మాట్లాడుతూ 14 సంవత్సరాలు కలిగిన బాలికలు తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని , సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ ఉపయోగపడుతుందని వైద్యబృందం ప్రతి స్కూలును సందర్శించి బాలికలకు వ్యాక్సిన్ వేస్తున్నారని బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నీరజ తో పాటు ఉపాధ్యాయ బృందం , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దుంపల అమర్ నాథ్ , పితాని దుర్గాప్రసాద్ కు అభినందనలు

*** విద్యానగర్ కాలనీ పంచాయితీ పాలకమండలి**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : ఖమ్మం పట్టణంలో నిర్వహించిన ఏఐటియుసి రాష్ట్ర మూడవ మహాసభలలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘ స్టేట్ లెవెల్ కమిటీ మెంబర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ సిబ్బంది దుంపల అమర్ నాథ్, పితాని దుర్గాప్రసాద్ ఎన్నిక కావడం పట్ల విద్యానగర్ కాలనీ గ్రామ సర్పంచ్ భుక్యా శాంతి శ్రీ, ఉపసర్పంచ్ వానిరెడ్డి మురళి ఆధ్వర్యంలో వివిధ వార్డ్ మెంబర్స్ సమక్షంలో వారికి పుష్పగుచ్ఛం అందజేస్తూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ ఇలాంటి పదవులు ఎన్నో అలంకరిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో సీనియర్ వార్డ్ నెంబర్ వాడపల్లి జకరయ్య , నాగమణి , రమాదేవి , రజిత ,కృష్ణవేణి , పంచాయితీ గుమస్తా రామకృష్ణ , బిల్ కలెక్టర్లు జోగ్ , కిషోర్ , కంప్యూటర్ ఆపరేటర్ మేఘన , పాల్గొన్నారు .

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

*** అధికారులకు అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ సూచన**




కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి:ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ పట్టాలు, పాసుపుస్తకాల జారీ, మీసేవ కేంద్రం ఏర్పాటు, భూముల అక్రమణ నివారణ, వారసత్వ ఉద్యోగం, దివ్యాంగుల పింఛన్, ఆసరా పింఛన్, వ్యవసాయ భూముల నక్షా జారీ తదితర సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం ఉండాలని, పెండింగ్‌లో ఉంచకుండా సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

*** స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కే. సక్కుబాయమ్మ గ్రామ సర్వే నెంబర్ 257/ఎఏ లో ఉన్న 5 ఎకరాల 26 గంటలకు జారీ చేసిన నాలా అనుమతిని రద్దుచేసి ఈ పాస్ పట్టాదార్ పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా,



తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామ పాలకవర్గ సభ్యులు తమ గ్రామంలో రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న అంబేద్కర్ విగ్రహం గ్రామపంచాయతీ కార్యాలయం ప్రక్కన ఉన్న ప్రభుత్వం స్థలంలో సురక్షితంగా మార్చడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపీడీవో ఖమ్మం రూరల్ మండలానికి తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పి.డి.ఎస్.యూ. ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్ల సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు పరుపులు, బెడ్లు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ సీహెచ్. రామ్మూర్తి , జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థినుల భద్రతపై షీ టీం అవగాహన

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : విద్యార్థినులు అప్రమత్తంగా ఉండడంతో పాటు, మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన చట్టాలు, రక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా షీ టీం ఎస్సై ఫజల్‌ఖాన్ సూచించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఫజల్‌ఖాన్ గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, స్ట్రీట్ హరాస్‌మెంట్, మహిళల భద్రత, వ్యక్తిగత రక్షణ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు హితవు పలికారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, మహిళలు, బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తించినా వెంటనే షీ టీంను సంప్రదించాలని తెలిపారు. షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని, సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు వివరించారు.

## ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి

*** నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలి: కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక శాస్త్రవేత్తలతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో ఏర్పడే ప్రతికూల పరిస్థితులను రైతులకు సమగ్రంగా వివరించాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, వాటిలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా



రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు, సూచనలు అందించేందుకు శాస్త్రవేత్తలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతిరోజూ పంటల సాగు నివేదికలను తనకు అందజేయాలని ఆదేశించారు.

*** ఇరిగేషన్ నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలి**

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇరిగేషన్ వనరుల్లోని నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. నీటి నిల్వల దృష్ట్యా పంట పొలాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని విడుదల చేయకూడదన్నారు. రిజర్వాయర్లు, కాలువలు, ఇతర ఇరిగేషన్ వనరుల వద్ద నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. తాగునీటి కోసం ఉద్దేశించిన నీటిని ఇతర అవసరాలకు మళ్లించకుండా క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా పరిస్థితిని అర్థం చేసుకుని నీటిని వృథా చేయకుండా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యానవన అధికారి తిరుపతి, తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక శాస్త్రవేత్త డా. మదన్ మోహన్ రెడ్డి, భూపాలపల్లి, మహాదేవపూర్ ఏడీఏలు రమేష్, శ్రీపాల్, అన్ని మండలాల మండల వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వస్తువుల ఎగుమతులు, దిగుమతులు రవాణా చేస్తున్న హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కుల యాకయ్య,టి యు సి ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి లు అన్నారు.హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ కు వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల మంది రాష్ట్రంలో 60 లక్షల మంది వస్తువుల రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.వారికి సమగ్ర వేతన చట్టం,సంక్షేమ బోర్డు లేక ప్రమాదాలు జరిగిన ప్రాణాలు పోయిన ఆదుకునే వారు ఎవరూ లేరని అన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలన వల్ల నిత్యవసర సరుకుల ధరలు భారీగా పెరిగి వస్తున్న ఆదాయం సరిపోవటం లేదన్నారు.వైద్య ఖర్చులు, పిల్లల చదువులు అన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న హమాలీ వర్కర్స్ కు సరైన చట్టం చేయాలని అన్నారు.భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా హమాలీలకు కూడా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి ఆదుకోవాలని వారు కోరారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ ప్రభుత్వానికి తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయకులు పూనం రవికుమార్, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వసంతరావు, వెంకన్న,రవి,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

*** రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వెల్‌జర్ల గ్రామ రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలను పరిశీలించి, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ సేవలు, సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ రాత్లావత్ బాబు నాయక్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామానికి ఆహ్వానించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, భరత్ లహోటి, వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ రాత్లావత్ బాబు నాయక్, కొండన్నగూడ గ్రామ సర్పంచ్ అనురాధ సురేష్ గౌడ్, వెల్‌జర్ల గ్రామ ఉపసర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి, ఏఓ నిశాంత్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి హిమబిందు, ఏఈఓలు గోవర్ధన్, తేజ్‌కుమార్, వినయ్, రాంబాబు, హెచ్‌ఈఓ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు. అలాగే వెల్‌జర్ల గ్రామ నాయకులు కటికెల తిరుపతి యాదవ్, జాంగారి రవి, జాంగారి జంగయ్య, దాస్య నాయక్, దొడ్డి రామదాసు, వార్డు సభ్యులు వెంకటయ్య నాయక్, పవన్ ముదిరాజ్, వట్టెల ప్రవళిక, మహేష్ యాదవ్, రవి నాయక్, నాయకులు కావలి యాదయ్య, సత్యం రెడ్డి, హరిచంద్ర నాయక్, రాజు, వెంకటేష్, ఎర్ర పెంటయ్య, శ్రీను నాయక్, రమేష్, మేళ్లగూడ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు. కొండన్నగూడ గ్రామానికి చెందిన నేతలు వెంకట్ రెడ్డి, సురేష్ గౌడ్, వై. శ్రీనివాస్ యాదవ్, అంజయ్య గౌడ్, యాదయ్య గౌడ్, మహిపాల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లేష్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

## ఖాతాదారుల సహకారంతో పురోభివృద్ధి లో సుధా బ్యాంక్




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఖాతాదారుల సహకారంతో పురోభివృద్ధిలో సుధా బ్యాంక్ పయనిస్తుందని బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ చెప్పారు. స్థానిక త్రివేణి ఫంక్షన్ హాల్ లో జరిగిన 27వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ ,సహకార రంగంలో 27 సంవత్సరాలుగా అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ క్రమం తప్పకుండా వాటాదారులకు డివిడెంట్ పంపిణీ చేస్తూ పురోభివృద్ధిలో బ్యాంకు పయనిస్తుందని చెప్పారు. బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ ఎజెండా తీర్మానాలను చదివి వినిపించి వాటాదారుల ఆమోదం పొందారు. 9 బ్రాంచీలతో బ్యాంకు పటిష్టంగా ఉందని రాబోయే కాలంలో మరిన్ని శాఖలు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. చైర్మన్ నివేదికను వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్ చదివి వినిపించారు. బ్యాంకు పనితీరును సమీక్షిస్తూ పుర ప్రముఖులు వాటాదారులు గండూరి శంకర్ ,పెద్దిరెడ్డి రాజా ఇరిగి కోటేశ్వరి ప్రసంగించారు .ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు ఏపూరి శ్రవణ్ కుమార్ , మీలా సందీప్, తోట శ్యాంప్రసాద్ ,డాక్టర్ విజయలక్ష్మి ,అనంతల శారద, బానోతు సుజాత, పటేల్ నరసింహారెడ్డి, భువనగిరి భాస్కర్, ఇరుకుల్ల చెన్నకేశవరావు వెంపటి రమణ ,పొనుగోటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ కోసం ఇంకుడుగుంతల నిర్మాణం చేయాలి

*** మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలో మంచినీటి సరఫరా లో ఇబ్బందులు వున్న చోట వాటర్ ట్యంకర్ ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి చెప్పారు. పట్టణంలో మంచినీటి సరఫరా పై ప్రజాస్ఫూర్తి తో ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో మంచినీటి ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమేనని అన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని అందువల్ల ఇళ్లలో బోర్లలో నీటి లభ్యత లేకపోవడం వలన ప్రజలు ఎక్కువగా మున్సిపాలిటీ నీటిపైనే ఆధారపడుతున్నారని అందువల్ల నీటి సమస్య ఏర్పడుతుందని అన్నారు. నల్లా నీరు వచ్చేటప్పుడు మోటార్లతో నీటిని అడ్డుకుంటే మోటార్లను తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. అందరికీ మున్సిపల్ వాటర్ అదేవిధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలు ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకోవాలని వర్షపు నీటి సంరక్షణ చేయాలని అన్నారు. స్థానిక రవి మహల్ లో వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు తవ్వారని, వాటి ద్వారానే ఫంక్షన్ హాల్ యొక్క నీటి అవసరాలు తీరుతున్నాయని ఆయన చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మకంపై నిషేధం ఉందని, స్థానికంగా అమ్మినట్లయితే చర్యలు చేపడతామని చెప్పారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తవ్విన ప్రదేశంలో గుంతలు లేకుండా చర్యలు చేపట్టాలని కాంటాక్టర్ కు చెప్పినట్లు తెలియజేశారు. మెప్మా శ్రీ నిధి లో రావాల్సిన బకాయిలపై తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని అన్నారు. మెప్మాలో బకాయిల వసూలు రికవరికి చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలు తెలియజేయడానికి మున్సిపాలిటీలో పౌర సేవా కేంద్రం ఏర్పాటు చేశామని, 08684220049 ఫోన్ నెంబర్ కి మున్సిపల్ కార్యాలయ పనివేళలలో ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని అన్నారు. తిరుమల నగర్ శ్రీరామ్ నగర్ లలో మెయిన్ రోడ్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ బిటి రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందని, త్వరలోనే కుడకుడలో 100 ఫీట్ల రోడ్ నిర్మాణం చేస్తామని చెప్పారు.

## పర్యావరణ పరిరక్షణ..
# ప్రతి ఒక్కరి బాధ్యత

- **గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కల పంపిణీ**
- **సర్పంచ్ కరిమికొండ స్వప్న అశోక్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ కరిమికొండ స్వప్న అశోక్ అన్నారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామపంచాయతీ ఆవరణలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కరిమికొండ స్వప్న అశోక్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న అశోక్ మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మొక్కను నాటడంతోపాటు సంరక్షించే బాధ్యత సైతం చేపట్టాలన్నారు. చెత్తను నాలుగు విధాలుగా వేరు చేయాలన్నారు. తడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, మెడికల్ వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలుగా విభజించి అందుకు సూచించే రంగు చెత్త డబ్బాలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జెల్ల పవనకుమార్, వార్డు సభ్యులు కొయ్యడ గౌతమి, రచ్చ ఉపేందర్, మాదూరి నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, గ్రామస్తులు గుర్రం ప్రసాద్ రెడ్డి, కొయ్యాడ సురేష్‌గౌడ్, బదుగు కైలాసం, బొడ్డు పరమేష్, ముషం వెంకటేశం, ఆల్మసిపేట సునీత, పర్వతల నర్సిరెడ్డి, పుర్రె రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలని వినతి

**- తీగుళ్ళ శ్రీనివాస్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సురేష్ రెడ్డికి ఎస్ఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తీగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ చౌటుప్పల్‌లోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపుతోందని ఆరోపించారు. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి మించి విద్యార్థులను చేర్చుకుంటూ, అనుమతించిన సీట్ల కంటే అధిక సంఖ్యలో అడ్మిషన్లు నిర్వహిస్తుందని ఆరోపించారు. యూనిఫాం, పుస్తకాలు, ఇతర వస్తువుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.20వేల వరకు వసూలు చేస్తూ, తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక తరగతుల పేరుతో కూడా విద్యార్థులపై అదనపు ఒత్తిడి, వేధింపులు కొనసాగుతున్నాయని ఆలోచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25శాతం ఉచిత సీట్లను కళాశాల అమలు చేయడం లేదని, అర్హులైన విద్యార్థులకు ఎలాంటి ఉచిత ప్రవేశాలు కల్పించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సురవి అరవింద్, పోలేపల్లి మల్లేష్ తదితరులున్నారు.

## అధిక దిగుబడి ఇచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన



ప్రజా స్ఫూర్తి కూసుమంచి:ఖమ్మం జిల్లా కుసుమంచి రైతు వేదికలో ఈరోజు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై రైతులతో ముఖాముఖి సమావేశమై ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై వివరించారు.ఈ సందర్భంగా రైతులకు పెసర, కంది మరియు వివిధ కూరగాయల విత్తనాలను ప్రదర్శించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ వ్యవధిలో అధిక దిగుబడి ఇచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితులలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని డీఏఓ పుల్లయ్య సూచించారు.రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్, మండల వ్యవసాయ అధికారి వాణి , వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్ లను సందర్శించిన బీజేపీ నేతలు

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డి నగర్ డివిజన్ లోని ప్రతి పోలింగ్ బూత్ లను సోమవారం బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగా శ్రీనివాస్ గౌడ్, సర్ డివిజన్ కోఆర్డినేటర్ , డివిజన్ ఇంచార్జ్ ఎస్ఆర్ఐ ఎం ఎస్ రాజు లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు బిఎల్ఓ, బి ఎల్ ఎ లను కలిసి ఓటర్ లిస్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజు నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలను
# ఆడిట్ రిపోర్ట్ నుంచి మినహాయించాలి

*** ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలను ఆడిట్ రిపోర్ట్ నుంచి మినహాయించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి అన్నారు. సోమవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ అయినటువంటి నవీన్ నికోలస్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని డిఓ ఆఫీస్ నుంచి జారీ చేయబడిన స్కూల్ ఆడిట్ రిపోర్ట్స్ కు సంబంధించిన జీవో గురించి చర్చించారు. ఈ చర్చలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల్లో చాలా పాఠశాలల్లో చాలా తక్కువ విద్యార్థులు ఉండటం కారణంగా టర్నోవర్ చాలా తక్కువగా ఉంటుందన్నారు. వారిని ఆడిట్ రిపోర్ట్ నుంచి మినహాయించాలని కోరారు. ఈటిఆర్ రెన్యువలకు సంబంధించి కేవలం ఆన్లైన్లో మాత్రమే అప్లికేషన్స్ సబ్మిట్ చేయాలని కానీ సంబంధిత అధికారులు మాన్యువల్ కాపీని కూడా అడగడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళారు. కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించి కేవలం ఆన్లైన్ అప్లికేషన్స్ మాత్రమే తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. అదేవిధంగా డి సి ఇ బి సంబంధించి ఆన్లైన్లో ఎంట్రీ అయిపోయిన తర్వాత హార్డ్ కాపీసు సంబంధిత అధికారులకు ఇవ్వకూడదని కూడా కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జయ నాగరాజు , సెక్రెటరీ అశోక్ కుమార్ , ట్రెజరర్ పరశురామ్ గౌడ్ , ఐట ప్రెసిడెంట్ , హైదరాబాద్ జిల్లా కోశాధికారి సోహెల్ , బండ్లగూడ మండల అధ్యక్షులు అబ్దుల్ సాబర్ , కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు జి తిరుపతి రెడ్డి , మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ చారి , ఉప్పల్ మండల్ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి , నరేందర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ కాలనీలో వైభవంగా ముగిసిన జగన్నాథ స్వామి ఉత్సవాలు




ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్ : స్థానిక ఆర్టీసీ కాలనీలోని జగన్నాథ స్వామి దేవాలయంలో గత పది రోజులుగా జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు కన్నుల పండుగగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా 10వ రోజున స్వామివారికి ధూపదీప నైవేద్యాలతో పాటు విశేష పూజలు, అభిషేకాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా భక్తుల జయజయధ్వానాలు, వేదమంత్రోచ్చారణలతో మారు మోగుతూ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నృత్య రూపకాలు నయన మనోహరంగా నిలిచాయి. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, కాలనీ పెద్దలు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అలరించిన చిన్నారులను కూడా ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ సభ్యులు, కాలనీ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. 10 రోజుల పాటు నిరంతరం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆర్టీసీ కాలనీ పరిసర ప్రాంతాలు భక్తి పారవశ్యంలో తేలియాడాయి.

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డు
# ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి

*** బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, జీవో నెం. 641ను తక్షణమే రద్దు చేయాలని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ అడ్వకేట్, షాద్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ తుప్పరి కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డు అంశంపై అఖిలపక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు ఏర్పాటుతో సిద్ధాపూర్ గ్రామంతో పాటు చుట్టుపక్కల దాదాపు 25 గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. జీవో నెం. 641ను రద్దు చేసి, సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకునే వరకు ప్రజల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ ఉద్యమానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, షాద్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ తుప్పరి కుమార్, అసెంబ్లీ అధ్యక్షుడు శివగల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నీరటి రాజు, జనరల్ సెక్రటరీ కొండేటి మహేందర్, శరత్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ చౌరస్తా రోడ్డు విస్తరణ వేగవంతం

*** భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాల తొలగింపు**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్: షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో చౌరస్తా రోడ్డు విస్తరణ పనులు సోమవారం అధికారుల సమన్వయంతో వేగంగా కొనసాగిస్తున్నారు. ఏసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ సరిత, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, ఎమ్మార్వో నాగయ్య, సీఐ సీతారాం, ట్రాన్స్కో ఏఈ వినోద్, ఆర్ అండ్ బీ ఏఈ, ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను పర్యవేక్షణ చేస్తున్నారు.రోడ్డు విస్తరణలో భాగంగా పరిగి రోడ్డులో సెంటర్ లైన్ నుంచి ఇరువైపులా 50 అడుగుల మేర మార్కింగ్ చేపట్టి, ఆ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న తీరును పట్టణ ప్రజలు ఆసక్తిగా వీక్షిస్తూ, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ... అధికారులను అభినందిస్తున్నారు. అధికారులు ప్రజల సహకారంతో రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.

## రైతుల మేలు కోరే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

*** ఎమ్మెల్యే మురళి నాయక్ వెల్లడి**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మానుకోట జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్వీఎం ఫంక్షన్ హాల్ లో మానుకోట జిల్లా ఫెర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ భూక్య మురళి నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల మేలుకోరే ప్రభుత్వం ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పాలకులంకాదు రైతు సేవకులం అని అన్నారు నూతనంగా ఎన్నికైన కమిటీ బాద్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయరంగా దేశమని ఇట్టి వ్యవసారంగానికి వెన్నుముక లాంటివాడు రైతు అని అలాంటి రైతుకు నాణ్యమైన విత్తనాలు అందిస్తే అందరూ ఆరోగ్యకరంగా ఉంటారని కల్తీ విత్తనాలు అందిస్తే అందరికీ అనారోగ్యంతో పాటు కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు అలాగే కార్యక్రమం మరో అతిధి ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు మాట్లాడుతూ ఫెర్టిలైజర్స్ నిర్వాహకులు విత్తన దుకాణ సముదాయ నిర్వాహకులు రైతులకు ఎప్పటికప్పుడు నాణ్యమైన విత్తనాల గురించి సహజ ఎరువులు వాడుతూ ఆర్గానిక్ పంటల వైపు మొగ్గు చూపేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని హితువు పలికారు . మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వేమిశెట్టి సోమయ్య సెక్రటరీగా ఓలం రమేష్ ట్రెజరర్ నల్లపు వీరన్న జిల్లా వయసు ప్రెసిడెంట్గా చిదిరాల జ్ఞానేశ్వర్ ప్రమాణస్వీకారం చేయగా మహబూబాబాద్ మండల అధ్యక్షుడిగా ఒక్కల శ్రీనివాస్ సెక్రటరీ ఉపేందర్ ట్రెజరీ ధూపట్టి వినయ్ ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు ఈ సందర్భంగా ప్రమాణస్వీకారం చేసిన బాధ్యులు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో మాకు ఈ పదవులు ఇచ్చినందుకు సంఘ బలోపేతానికి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి రమేష్ మదన్ గోపాల్ లోయ ప్రతాపని పాండురంగయ్య బోనగిరి లక్ష్మీనారాయణ చిదిరాల జ్ఞానేశ్వర్ నేరుటి లక్ష్మీనారాయణ వార్డు కౌన్సిలర్ రవి నాయక్ నాళ్ల లక్ష్మీనరసింహారావు మరియు జిల్లాలోని అన్ని ప్రాంతాల ఫెర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ విత్తన నిర్వాహకులు రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజల ధరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

*** జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, జిల్లాలోని అన్ని విభాగాల ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ అమలుకు యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో. అదనపు కలెక్టర్ రెవెన్యు కె.అనిల్ కుమార్,ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డి.ఆర్.ఓ నాగలక్ష్మి, ట్రైనీ డిప్యుటీ కలెక్టర్ నితీష్ కుమార్ ల తొ కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సంది మహబూబ్ రెడ్డి తనకు ఉన్న భూమిలో గల సర్వే నెంబర్ లో ఈ మధ్య జరిగిన భూబారతి డిజిటల్ సర్వే లో తొమ్మిది గుంటలు తక్కువగా చూపిస్తుందని, అట్టి భూమి సర్వేయర్ ద్వారా తిరిగి సర్వే చేపించి సరిచేసి ఇవ్వగలరని కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజవాణిలో (184) దరఖాస్తులు వచ్చిన వినతులను వివిధ శాఖల అధికారులకు పరిష్కారం కొరకు ఆదేశించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విభాగాల వారు ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో నిర్వహించబోయే కార్యక్రమాలు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు



శాఖలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలని తద్వారా నిర్దిష్టమైన వేగమైన పనులు జరుగుతాయని అట్టి నివేదికలను ప్రతి తనకు సమర్పించాలని కలెక్టర్ సంబంధిత విభాగాలను ఆదేశించారు, ముఖ్యమంత్రి గ్రీవెన్స్, జిల్లా గ్రీవెన్స్ లపై శాకలవారీగా సమీక్ష సమావేశం నిర్వహించి దరఖాస్తుదారులకు వెంటనే లిఖితపూర్వకంగా సమాధానాలు పరిష్కారాలు చూపాలని, జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, వారు క్షేత్రస్థాయిలో పిల్లలతో కలిసి భోజనం చేసి వసతి గృహం లోని సౌకర్యాలను తనిఖీ చేయాలని అట్టి నివేదికను వెంటనే తమకు అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా

# ఎన్టీఆర్.. భుజానికి గాయం

హైదరాబాద్: ప్రముఖ నటుడు ఎన్టీఆర్ (NTR) గాయపడ్డారు. సోమవారం సాయంత్రం భుజానికి స్వల్ప గాయమైనట్లు ఆయన కార్యాలయం తెలిపింది. డా.జె.మధుసూదన్‌రావు, డా.ఆర్.ఎ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలోని బృందం పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించింది. ఎన్టీఆర్ పూర్తిగా కోలుకునేందుకు 68 వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు తెలిపింది. అభిమానులు, శ్రేయోభిలాషులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఎన్టీఆర్ ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని పేర్కొంది.





# మిరాయి బ్యూటీ కొరియన్ గర్ల్‌గా మారితే..

అశోకవనంలో అర్జున కళ్యాణం సినిమాలో సెకండ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరిసి తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది రితికా నాయక్. ఆ తర్వాత మిరాయి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఈ బ్యూటీ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టింది. వీటిలో ఒకటి డ్యుయెట్ కాగా.. మరో సినిమా కొరియన్ కనకరాజు. ఇండోకొరియన్ హర్రర్ కామెడీ నేపథ్యంలో వరున్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీ ఆగస్టు 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ భామ రీసెంట్‌గా కొన్ని ఫోటోలను నెట్టింట దర్శనమిచ్చి అందరినీ మెస్మరైజ్ చేస్తోంది. వైబ్రాంట్ ఫ్లోరల్ స్కర్ట్, వైట్ షర్ట్ వేసుకున్న రితికా నాయక్ గోల్డెన్ కలర్ జ్యువెలరీతో తళుక్కున మెరుస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. మిరాయి బ్యూటీ కొరియన్ గర్ల్‌గా మారితే ఇలా ఉంటుందని చెప్పకనే చెబుతూ కుర్రకారు గుండెలను పిండేస్తుంది రితికానాయక్. చబ్బీచబ్బీగా క్యూట్ లుక్ స్టిల్స్ సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి.




# జయకృష్ణ మొదటి సినిమా కోసం ఎగ్జైటింగ్‌గా ఉన్నాం..

**'శ్రీనివాస మంగాపురం'పై మహేష్ బాబు**

సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరో వస్తున్నాడు. దివంగత రమేష్ బాబు తనయుడు జయకృష్ణ మరో మూడు రోజుల్లో వెండితెరపై కనిపించనున్నాడు. అతను హీరోగా నటించిన మొదటి సినిమా శ్రీనివాస మంగాపురం జులై 30న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఆర్‌ఎక్స్ 100, మంగళవారం వంటి డిఫరెంట్ సినిమాలు తీసిన అజయ్ భూపతి జయకృష్ణ డెబ్యూ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ రవీనాటాండన్ కూతరు రషా తడానీ ఈ మూవీలో హీరోయిన్ గా నటిస్తోంది. తిరుపతి పుణ్యక్షేత్రం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ ప్రేమకథా చిత్రం ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకుంది. ఈ నెల 30న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో జయకృష్ణతో పాటు శ్రీనివాస మంగాపురం చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ చెబుతూ ఒక వీడియోను రిలీజ్ చేవారు. తన అన్నయ్య రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని డెబ్యూ చేస్తున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమా గురించి మహేష్ బాబు స్పందించారు. జయకృష్ణ డెబ్యూ గురించి తమ కుటుంబం అంతా ఎగ్జైటింగ్‌గా ఉన్నామని.. కచ్చితంగా ఈ సినిమాతో జయకృష్ణ, రషా హిట్ అందుకుంటారని నమ్మకంగా తెలిపారు మహేష్. తన 'రాజకుమారుడు' విడుదలైన జులై 30నే 'శ్రీనివాస మంగాపురం' విడుదలవుతుందని.. ఇది కచ్చితంగా అశ్వినీదత్ ప్లాన్ చేసుంటారని చెప్పారు సూపర్ స్టార్. మరి జయకృష్ణ గురించి మహేష్ ఇంకేం మాట్లాడారో ఈ వీడియోలో చూద్దాం రండి.

# రామ్‌చరణ్‌కు సర్జరీ



అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ మణికట్టు సర్జరీ నిమిత్తం కోయంబత్తూరు పయనమయ్యారు. అక్కడి గంగా ఆసుపత్రిలో ఆయనకు సర్జరీ జరుగనున్నది. ప్రత్యేక వైద్య నిపుణులు ఈ సర్జరీని నిర్వహించనున్నారు. 'పెద్ది' సినిమా షూట్‌లో రామ్‌చరణ్ మణికట్టుకు గాయమైన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ సినిమా ప్రచార కార్యక్రమాల్లో ధాటిగా పాల్గొన్నారాయన. సర్జరీ సమయంలో రామ్‌చరణ్‌కు తోడుగా ఆయన సతీమణి ఉపాసనతోపాటు తల్లిదండ్రులు సురేఖ, చిరంజీవి కూడా కోయంబత్తూరు వెళ్లినట్టు సమాచారం.



# మనసులో మాట బయటపెట్టిన హాట్ బ్యూటీ..

టాలీవుడ్ లో మోస్ట్ గ్లామరస్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది ఈ చిన్నది. ఇప్పుడు యాక్షన్స్ సీన్స్ చేయాలని ఉంది అంటూ చెప్పుకొచ్చిన ఆమె ఎవరో కాదు మాళవిక మోహనన్. హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో వచ్చిన ఈ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలై బోల్తా కొట్టింది. 2013లో బట్టం బోలే సినిమాతో మలయాళీ సినీరంగంలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రజినీకాంత్ హీరోగా నటించిన పెట్టా చిత్రంలో కనిపించింది. ఈ మూవీతో తమిళం ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత కోలీవుడ్ ఇండస్ట్రీలో వరుస ఆఫర్స్ అందుకుంది. ధనుష్, విజయ్ దళపతి వంటి స్టార్ హీరోలతో కలిసి నటించిన మాళవిక.. ఇక ఇప్పుడు యాక్షన్ ఎంటర్టైనర్ రోల్స్ చేయాలని ఉందని తెలిపింది. అలాగే ఇండస్ట్రీలో మహిళామేకర్స్ పెరగాలని, లాపత లేడీస్ సినిమా నన్ను బాగానే ఆకట్టుకుంది. కిల్ బిల్ లాంటి పాత్ర చేయాలని ఉందని చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

# 'స్పిరిట్'లో కత్రినా కైఫ్ ..

# ప్రభాస్ సినిమాపై బాలీవుడ్‌లో హాట్ టాక్






పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'స్పిరిట్'. అనౌన్స్‌మెంట్ జరిగిన నాటి నుంచే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ మూవీకి సంబంధించి బాలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన వార్త వైరల్‌గా మారింది. అదేంటంటే.. స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం.

'స్పిరిట్'లో ఇప్పటికే హీరోయిన్‌గా తృప్తి డిమ్రి నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మరో హీరోయిన్‌గా కాకుండా, కథలో కీలక మలుపు తీసుకొచ్చే ప్రత్యేక పాత్ర కోసం కత్రినా కైఫ్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు ముంబై సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

స్క్రీన్‌పై ఆమె కనిపించే సమయం పరిమితంగానే ఉన్నప్పటికీ, కథను ప్రభావితం చేసే పవర్‌ఫుల్ రోల్‌లో కత్రినా కనిపిస్తారని టాక్ వినిపిస్తోంది. ఆమె పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని కూడా వార్తలు వస్తున్నాయి. ప్రారంభంలో ఈ సినిమాలో హీరోయిన్‌గా దీపికా పదుకొణె పేరు వినిపించింది. అయితే ఆమె ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్న తర్వాత తృప్తి డిమ్రిని హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఇప్పుడు కత్రినా కైఫ్ పేరు తెరపైకి రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి పెరిగింది. కత్రినా కైఫ్ గతంలో విక్టరీ వెంకటేష్‌తో 'మల్లీశ్వరి', నందమూరి బాలకృష్ణతో 'అల్లరి పిడుగు' చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత ఆమె పూర్తిగా బాలీవుడ్‌కే పరిమితమయ్యారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఆమె స్పిరిట్ లో నటిస్తే, అది ఆమెకు చాలా కాలం తర్వాతి తెలుగు సినిమా అవుతుంది. ప్రస్తుతం కత్రినా కైఫ్ 'స్పిరిట్'లో నటిస్తున్నారనే వార్త సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు కత్రినా కైఫ్ గానీ, చిత్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా గానీ, నిర్మాణ సంస్థ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఈ వార్తపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.